

డిసెంబర్‌లోగా పనులు..

అన్ని రకాల అభివృద్ధి పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ అన్నారు.


వివరాలు 10లో ▸



సమష్టి కృషితోనే..

సమష్టిగా కృషిచేస్తేనే ఇంటర్‌లో ఉత్తమ ఫలితాను సాధించవచ్చని జిల్లా ఇంటర్ విద్యాధికారి(డీఐఈఓ) రవీందర్‌రెడ్డి అన్నారు.

వివరాలు 11లో ▸



ప్రభుత్వ బడి సమస్యల ఒడి

మర్పడ్గ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలి

- న్యాయమూర్తి స్వాతిరెడ్డి



జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సిద్దిపేట జిల్లా జైలును న్యాయమూర్తి శనివారం సందర్శించారు. జైలులోని ఖైదీల వంట గది, స్టోర్ రూమ్, టాయిలెట్స్‌ను పరిశీలించి, జైలులోని 34మంది ఖైదీలకు కల్పిస్తున్న భోజన వసతుల గురించి జైలు సూపరింటెండెంట్ వికాస్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీకర్‌రెడ్డి, వెంకటేశ్, రాజ్యలక్ష్మి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంపింగ్



మల్లన్న సాగర్‌లోకి గోదావరి జలాలు

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల పంపింగ్ కొనసాగుతోంది. నాలుగు మోటార్ల ద్వారా 5 రోజుల్లో 2.30 టీఎంసీల నీటిని పంపింగ్ చేసినట్లు ప్రాజెక్టు డీఈ చెన్ను శ్రీనివాస్ తెలిపారు. ఇందులో 1.50 టీఎంసీల నీటిని కొండపోచమ్మ సాగర్ రిజర్వాయర్‌కు తరలించారు. మల్లన్న సాగర్‌లో ప్రస్తుతం 0.80 టీఎంసీల నీరు చేరడంతో 11.10 టీఎంసీలకు చేరింది. కాగా గోదావరి నదిలో వరద ఉధృతి కొనసాగుతుండగా మల్లన్న సాగర్‌కు పంపింగ్ జరుగుతోంది.

జిల్లా యోగా పోటీలు విజయవంతం



బాలికలు, మహిళల విభాగాల విజేతలతో డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 5వ జిల్లా స్థాయి యోగా పోటీలు శనివారం ముగిశాయి. సిద్దిపేట యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో రెండురోజులపాటు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయం సాధించిన క్రీడాకారులు డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి బహుమతులు, సర్టిఫికెట్‌లు అందించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే

సబ్ జూనియర్ విభాగంలో శ్రీవల్లిక, అవంతిక, భార్గవి, వినయ్‌కుమార్, రాహుల్, విశాల్‌లు, జూనియర్ విభాగంలో స్వాతి, నికిత, అర్పిత, నిశాంత్, ఉదయ్, నితిన్‌చౌహన్, సీనియర్ విభాగంలో రాణి, వైష్ణవి, అంకిత, అభిషేక్, ప్రవీణ్, మాస్టర్స్ విభాగంలో శ్రీప్రసన్న, సంధ్య, చందన, సంధ్య, మంజుల, 35 నుంచి 45 సంవత్సరాల విభాగంలో ఉషారాణి, నరేశ్, 45 నుంచి 55 సంవత్సరాల విభాగంలో ఉమాదేవి, మంజుల, కవితారావు, సురేశ్‌యాదవ్‌లు విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. వీరు త్వరలో హైదరాబాద్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలం నేపథ్యంలో దోమలు వృద్ధి చెందకుండా ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కంటే ముందస్తు జాగ్రత్తలు పాటించడం చాలా ఉత్తమం. జ్వర లక్షణాలు కనిపించగానే నిర్లక్ష్యం చేయొద్దు. పారాసిటమాల్ మాత్ర వేసుకోవాలి. అలాగే ప్రభుత్వ వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి. అన్ని ఫీవర్‌లు డెంగీ కావని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్‌బాబ్జి తెలిపారు. శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ప్రజలు అడిగిన పలు ప్రశ్నలకు సానుకూలంగా స్పందించి జవాబునిచ్చారు.



- డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు
- జిల్లాలో కొనసాగుతున్న ఇంటింటి ఫీవర్ సర్వే
- పౌష్టికాహారం, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్‌బాబ్జి



సిద్దిపేటకమాన్: జిల్లాలో వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వారం రోజులుగా సిబ్బంది ఇంటింటి ఫీవర్ సర్వే కార్యక్రమం కొనసాగుతుందని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వినోద్ తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రశ్న: విష జ్వరాల లక్షణాలు? ఈ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు?

– పప్పు రవి, సిద్దిపేట, రాకేష్, దుబ్బాక

డాక్టర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. వాతావరణంలో మార్పుల వల్ల వైరస్ వల్ల విష జ్వరాలు వస్తాయి. జ్వరం (హై టెంపరేచర్), తలనొప్పి, ఒళ్లు నొప్పులు, గొంతునొప్పి, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే పారాసిటమల్ మాత్ర వేసుకోవాలి. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించి సలహాలు తీసుకోవాలి. దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలి. ఇంటి పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

ప్ర: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి? చర్యలు?

– లక్ష్మీనారాయణ తోటపల్లి, రమేష్ వర్గల్

డా: ప్రస్తుతం వాతావరణంలో వచ్చే మార్పుల వల్ల వైరల్ ఫీవర్స్ బారీన పడుతున్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీలలో అన్ని రకాల పరీక్షలు చేస్తున్నాం. పీహెచ్‌సీలలో రక్త నమునాలు సేకరించి సిద్దిపేట ప్రభుత్వాస్పత్రి టీ హబ్‌లో పరీక్షలు నిర్వహించి రిపోర్టులు అందజేస్తున్నాం. వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ఇంటింటి ఫీవర్ సర్వే నిర్వహించి జ్వర లక్షణాలున్న వారిని దగ్గర్లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నాం.

ప్ర: డెంగీ వైరస్ ప్రభావం శరీరంలో ఎన్ని రోజులు ఉంటుంది?

– రాజిరెడ్డి, సిద్దిపేట

డా: డెంగీ బారిన పడిన వారికి చికిత్స అనంతరం వారంలోపు యాంటీబాడీస్ ఉత్పత్తి అవుతాయి. దీని ప్రభావం శరీరంలో మూడు నుంచి ఐదు రోజుల వరకు ఉంటుంది. గుర్తింపు పొందిన వైద్యుడి పర్యవేక్షణలో మాత్రమే చికిత్స తీసుకోవాలి.

ప్ర: జ్వరం వచ్చి తగ్గినా విపరీతమైన ఒళ్లు నొప్పులు ఉంటున్నాయి. దీనికి చికిత్స?

– స్వామి, సిద్దిపేట

డా: జ్వరం వచ్చి తగ్గిన తర్వాత కూడా ఆ ప్రభావం వారం రోజుల వరకు ఉంటుంది. మంచి పౌష్టికాహారం, తాజా పండ్లు తీసుకోవడంతో పాటు మంచి నీరు ఎక్కువగా తీసుకోవాలి. వైద్యుడి సలహా మేరకు మందులు వాడాలి.

ప్ర: మెయిన్ రోడ్డు పక్కన మురుగు నిల్వ ఉండటం వల్ల దోమలు వృద్ధి చెంది, వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది?

– రంజిత్, మిట్టపల్లి

డా: సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి మురుగు నీటిని తొలగించి సమస్య పరిష్కరిస్తాం.

ప్ర: మండలాల్లో విష జ్వరాలు ఎక్కువగా వస్తున్నాయి.. జాగ్రత్తలు?, అలాగే హుస్నాబాద్ ఆస్పత్రిలో వైద్యులు లేరు?

– శ్రావణ్‌కుమార్ బెజ్జంకి, రవిందర్‌గౌడ్ హుస్నాబాద్.

డా: చాలా గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వర లక్షణాలు ఉన్న వారికి మందులు అందజేశాం. అదేవిధంగా వారం నుంచి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నాం. వ్యాధులు ప్రబలకుండా డ్రైనేజీలలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్నాం. శానిటేషన్ డ్రైవ్ కొనసాగుతోంది. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గర్లోని పీహెచ్‌సీకి వెళ్లాలి. హుస్నాబాద్‌లో ప్రభుత్వాసుపత్రి వైద్యులతో మాట్లాడి వారు అందుబాటులో ఉండేలా చూస్తాం.

దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయడం, ఫాగింగ్ స్ప్రే చేయడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ప్ర: వైరల్ ఫీవర్స్ ఎక్కువగా వస్తున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో అనవసర టెస్టులు చేసి ఫీజులు అధికంగా వసూల్తున్నారు. వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

– శ్రీకాంత్, దుబ్బాక

డా: ఈ సీజన్‌లో వైరల్ ఫీవర్స్ ఎక్కువగా వస్తున్నాయి. అన్ని జ్వరాలు డెంగీ కాదు. ప్రైవేటు ఆస్పత్రుల్లో, ల్యాబ్‌ల్లో ర్యాపిడ్ టెస్టుల ద్వారా డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఎలిసా టెస్టు ద్వారా మాత్రమే డెంగీని నిర్ధారణ చేయాలి. ప్రైవేటు ల్యాబ్‌లు తప్పుడు రిపోర్టులు ఇచ్చే వారిపై చర్యలు తప్పవు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రతీ వైద్యానికి నిర్ధారించిన రుసుం మాత్రమే తీసుకోవాలి. టీహబ్‌లో అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

ప్ర: డెంగీ, మలేరియా గుర్తించడం ఎలా?

– శ్రీనివాస్, చేర్యాల

డా: డెంగీ, మలేరియా వ్యాధులను రక్త పరీక్షల ద్వారా పరీక్షించి నిర్ధారిస్తాం. జిల్లా కేంద్రం సిద్దిపేట ప్రభుత్వాస్పత్రిలోని టీహబ్‌లో అన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. డెంగీ, మలేరియా వంటి వాటికి వైద్యులు నిర్ధారణ అనంతరం వైద్యుడి పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాలి.



అధికారుల సమీక్షలో ఆర్డీఓ సదానందం, ఏసీపీ మధు తదితరులు

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- అధికారులకు ఆర్డీఓ, ఏసీపీ ఆదేశం
- వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్ష

సిద్దిపేటజోన్: వినాయక చవితి సందర్భంగా నవరాత్రులు, విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో అధికార యంత్రాంగం సమన్వయంతో సాగాలని అలాగే ప్రశాంత, శాంతియుత వాతావరణంలో పండుగ జరిగేలా చూడాలని సిద్దిపేట ఆర్డీఓ సదానందం, సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు. శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో వినాయక నవరాత్రుల సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వినాయకచవితి, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా ఆయా శాఖల అధికారులు సమష్టిగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా వినాయక మండపాల వద్ద, నిమజ్జనం జరిగే చెరువుల వద్ద విద్యుత్ సమస్య లేకుండా చూడాలని సూచించారు. సిద్దిపేట పట్టణంలో అన్ని పండుగలను సమష్టిగా చేస్తారని, భిన్నత్వంలో ఏకత్వం తరహాలో సిద్దిపేట ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసి అనుమతి పొందాలన్నారు. మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారి శ్రీధర్, అగ్నిమాపక అధికారి పరమేశ్వర్ పాల్గొన్నారు.

గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం



నూతన చైర్మన్ నరేందర్‌రెడ్డి

గజ్వేల్: గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీకి చైర్మన్‌గా జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వి.నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. అదే విధంగా వైస్ చైర్మన్‌గా గజ్వేల్ పట్టణానికి చెందిన సర్దార్‌ఖాన్‌ను నియమించగా మరో 12మంది సభ్యుల నియామకాన్ని ఖరారు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వారితో పాటు కమిటీలో జిల్లా మార్కెటింగ్ అధికారి, వ్యవసాయశాఖ ఏడీ, సహకార సంఘం చైర్మన్, మున్సిపల్ చైర్మన్‌లు ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉండనున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని ఖరారు చేసిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు : సీపీ

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలలో నివారణకు తగు చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ అనురాధ తెలిపారు. శనివారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో హుస్నాబాద్ డివిజన్ పోలీసు అధికారులతో కలిసి ఆమె పెండింగ్ కేసులపై సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులను వెంటనే డిస్పోజల్ చేయాలని సూచించారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు సీసీటీఎన్‌ఎస్‌లో నమోదు చేయాలన్నారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండగల సందర్భంగా పీస్ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. ఏసీపీ, సీఐలు పాల్గొన్నారు.

తెలుపు రేషన్ కార్డులు ఇవ్వాలి

మంత్రి పొన్నంకు వినతి



పొన్నంకు వినతిపత్రం ఇస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

హుస్నాబాద్: ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు తెలుపు రేషన్ కార్డులు, వృద్ధాప్య పింఛన్లు, హెల్త్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు శుక్రవారం రాత్రి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగ సంఘం నాయకులు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పింఛన్ సౌకర్యం లేదని, రిటైర్ అయిన తర్వాత ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. మానవతా దృక్పథంతో ప్రభుత్వం నుంచి ప్రత్యేక జీఓ ఇప్పించి ఆదుకోవాలన్నారు. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు సమావేశం నిర్వహించాలనుకుంటే చెట్ల కిందే పెట్టుకుంటున్నామని, పట్టణంలో ప్రభుత్వానికి సంబంధించిన రెండు గుంటల స్థలం ఇప్పించాలనివిజ్ఞప్తి చేశారు.

సండే స్పెషల్

ఆటాడుకుందాం రా...!

చిన్నారులు, యువకులు విద్యతోపాటు క్రీడల్లో ఆసక్తి చూపిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నిరంతరం మైదానాలకు వెళ్లి శిక్షణలను తీసుకుంటున్నారు. ఈ క్రమంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడా మైదానాలు కిక్కిరిసిపోతున్నాయి. మైదానాలకు డిమాండ్ పెరగడంతో కొందరు నిర్వాహకులు అద్దెకు ఇస్తున్నారు.

- క్రీడలపై పెరుగుతున్న ఆసక్తి
- పటాన్‌చెరు నియోజకవర్గంలో మైదానాలకు భారీ డిమాండ్
- స్థలాలను అద్దెకిస్తున్న నిర్వాహకులు
- అభివృద్ధికి నోచుకోని ప్రభుత్వ మైదానాలు

పర్స శ్రీనాథ్
రామచంద్రాపురం (పటాన్‌చెరు)



10లో

కుమ్మేసిన వాన

- ఇబ్బందులు పడిన ప్రజలు



వర్షంలో గొడుగుతో ప్రయాణిస్తున్న వాహనదారులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలో శనివారం వర్షం కురిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు చిరుజల్లులతో కూడిన మోస్తరు వాన కురిసింది. దీంతో ప్రజలు, ప్రయాణికులు, జిల్లా కేంద్రానికి వివిధ గ్రామాలు, పట్టణాల నుంచి పనుల నిమిత్తం వచ్చిన వారు తిరిగి వెళ్లే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శుక్రవారం మామూలుగా ఉన్న వాతావరణం శనివారం ఒక్కసారిగా మేఘావృతమై వర్షం కురిసింది.

ప్రాణనష్టం ఉండకూడదు

- అతి భారీ వర్షాల అలర్ట్ నేపథ్యంలో అధికారులకు కలెక్టర్ ఆదేశం
- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేటరూరల్: అధిక వర్షాల కారణంగా జిల్లాలో ఎక్కడా కూడా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం అధిక వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రెవెన్యూ, పంచాయతీ, ఇరిగేషన్ పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. వాతావరణ శాఖ జిల్లాలో రెడ్, ఎల్లో, ఆరెంజ్ కలర్ అలర్ట్ ప్రకటించినందున జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో జిల్లాలో ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజల సౌకర్యార్థం జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో 08457–230000 టోల్ ఫ్రీ నంబర్‌తో కంట్రోల్ రూంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డివిజన్, మండల స్థాయిలలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు.

వర్షాల పట్ల జాగ్రత్త

సిద్దిపేటకమాన్: రాబోవు రెండు, మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట సీపీ అనురాధ సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్



నాసర్‌పూర అర్బన్ పీహెచ్‌సీలో సిబ్బందితో మాట్లాడుతున్న గరీమా అగర్వాల్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రతీఒక్కరు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్గి ఉండాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ఇందిరానగర్‌లో శనివారం పర్యటించారు. ముఖుల్ మాధవ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 9, 10వ తరగతి విద్యార్థినులకు 24 సైకిళ్లను పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రేరణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

సిద్దిపేటకమాన్: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం బావుంటుందని అదనపు కలెక్టర్ గరీమా అన్నారు. సిద్దిపేట అర్బన్ నాసర్‌పూర పీహెచ్‌సీని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. వైద్య సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకుని పలు రికార్డులను పరిశీలించారు.

వ్రత వైభవం



నాచగిరిలో వ్రతమాచరిస్తున్న దంపతులు

రాష్ట్రంలో సుప్రసిద్ధమైన నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రం శనివారం శ్రావణశోభ సంతరించుకుంది. శుభకర శ్రావణమాసంలో చివరి శనివారం కావడంతో వర్షపు జల్లులు లెక్కచేయకుండా హైదరాబాద్ జంట నగరాలు, మెదక్, సిద్దిపేట జిల్లాల నుంచి భక్తులు పోటెత్తారు. హరిద్రవాగు నదిలో, ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలాచరించారు. దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యదేవుని వ్రతమాచరించారు. శ్రీలక్ష్మీనృసింహునికి నిజాభిషేకం, కల్యాణం జరిపించారు. 60 సత్యనారాయణ వ్రతాలు, 9 నిజాభిషేకాలు, 18 స్వామివారి కల్యాణాలు జరిగాయని ఈఓ అన్నపూర్ణ తెలిపారు. వర్గల్(గజ్వేల్):

శనిత్రయోదశి మహోత్సవం



శనీశ్వరుని సామూహిక తైలాభిషేక పూజలో భక్తులు

సుప్రసిద్ధమైన వర్గల్ శ్రీవిద్యాసరస్వతి శనీశ్వర క్షేత్రం శనిత్రయోదశి పర్వదిన వేడుకలతో అలరారింది. విశేషమైన శ్రావణమాసంలో శనివారం త్రయోదశి కలిసిరావడంతో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా శనీశ్వరునికి తిల, తైలం సమర్పించేందుకు భక్తులు పోటెత్తారు. హైదరాబాద్, సికింద్రాబాద్, ఉమ్మడి మెదక్ జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులతో శనీశ్వర పూజ జరిపించారు. మండపంలో సామూహిక అర్చన అనంతరం శనీశ్వరుని మూలవిరాట్టుకు తిల, తైలం సమర్పించారు. వర్గల్(గజ్వేల్):

ఆటాడుకుందాం రా..!

- క్రీడలపై పెరుగుతున్న ఆసక్తి



డీజీఆర్ స్పోర్ట్స్ క్లబ్‌లో..

పటాన్‌చెరు నియోజకవర్గంలో అనేక క్రీడా మైదానాలు, అకాడమీలు ఉన్నాయి. రోజురోజుకూ వీటికి డిమాండ్ పెరిగి ప్రాంగణాలన్నీ కిక్కిరిసిపోతున్నాయి. దీంతో మైదానాల అవసరం ఎక్కువ కావడంతో కొందరు క్రీడా అకాడమీలను ఏర్పాటు చేసి ఉపాధి పొందుతున్నారు. క్రీడా ప్రాంగణంలోని సౌకర్యాలు, కోచ్‌ను బట్టి అక్కడికి వచ్చే వారి నుంచి ఫీజులను వసూలు చేస్తున్నారు. కొంత మంది క్రీడా మైదానాలను గంటల వారీగా కూడా అద్దెకు ఇస్తున్నారు. ఉద్యోగస్తులు సెలవు దినాల్లో స్థలాన్ని అద్దెకు తీసుకొని వారికి నచ్చిన ఆటలను ఆడుకుంటున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలు లేకపోవడంతో చాలా మంది ప్రైవేట్ క్రీడా అకాడమీలను ఆశ్రయిస్తున్నారు.



వాలీబాల్ ఆడుతున్న ఉద్యోగులు

క్రీడలతో ఆరోగ్యం, క్రమ శిక్షణ..

ఈ పోటీ ప్రపంచంలో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. దీంతో తల్లిదండ్రులు వారి చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నారు. క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్‌తో పాటు ఆరోగ్యం, క్రమశిక్ష వస్తుందని భావిస్తున్నారు. దానికి అనుగుణంగా అకాడమీల్లో చేర్పించే శిక్షణ ఇప్పిస్తున్నారు.

అద్దెకు క్రీడా మైదానాలు..

ఐటీ ఉద్యోగస్తులు సైతం క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నిత్యం పని ఒత్తిడితో ఉండేవాళ్లు సెలవు రోజుల్లో, సమయం దొరికినప్పుడు మైదానాలను అద్దెకు తీసుకొని ఆటలు ఆడుకుంటున్నారు. దీంతో నిర్వాహకులు ఉదయం, రాత్రి సమయాల్లో అద్దెకు ఇస్తున్నారు. అక్కడి సౌకర్యాలను బట్టి మైదానాలకు అద్దె నిర్ణయిస్తున్నారు. క్రికెట్ ఆటకు గంటకు రూ.500, ఫుట్‌బాల్ క్రీడకు రాత్రి సమయంలో రూ.3,000, ఉదయం సమయంలో రూ.1,500, వాలీబాల్ క్రీడకు గంటకు రూ.500 రుసుము తీసుకుంటున్నారు.





సరైన గ్రౌండ్‌లు లేకనే..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం క్రీడా మైదానాలను అభివృద్ధి చేయకపోవడంతో అనేక మంది క్రీడలకు దూరమవుతున్నారు. ప్రధానంగా గ్రామీణ క్రీడాకారులు డబ్బులు ఖర్చు పెట్టుకొని ప్రైవేట్ క్రీడా ప్రాంగణాలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. క్రీడా మైదానాలు లేకపోవడంతో ప్రైవేట్ క్రీడా అకాడమీలకు మంచి డిమాండ్ వచ్చింది.

ప్రైవేట్ క్రీడా అకాడమీలకు డిమాండ్..

అనేక మంది యువకులు, క్రీడాకారులు అకాడమీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు కోసం పట్టణ ప్రాంతలలో భూములను లీజుకు తీసుకొని క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేస్తున్నారు. మంచి శిక్షకులతో శిక్షణ అందిస్తున్నారు. వాటికి ఆదరణ ఎక్కువగా ఉండడంతో అనేక మంది ఈ రంగం వైపు మొగ్గు చూపుతున్నారు. ఉపాధితోపాటు మంచి క్రీడాకారులను తయారు చేస్తున్నామన్న సంతృప్తి పొందుతున్నారు.

కోచ్‌లతో ప్రత్యేక శిక్షణ..

ప్రధానంగా క్రీడా అకాడమీలో నైపుణ్యం కలిగిన కోచ్‌లతో శిక్షణ అందిస్తున్నారు. మెరుగైన సౌకర్యాలు ఉన్న క్రీడా అకాడమీల్లో బ్యాడ్మింటన్‌కు గంటకు రూ.400, నెల శిక్షణకు రూ.7 వేలు, బాక్స్ క్రికెట్‌కు ఉదయం గంటకు రూ.700, రాత్రి రూ.1,000, స్నూకర్ క్రీడలకు గంటకు రూ.250, వాలీవాల్ క్రీడకు నెలకు శిక్షణకు రూ.2 వేలు, స్కేటింగ్‌కు నెలకు రూ.2వేలు, జిమ్నాస్టిక్స్‌కు శిక్షణకు నెలకు రూ.1,500 రుసుము తీసుకుంటున్నారు.



విద్యార్థికి క్రికెట్‌లో మెలకువలు నేర్పుతున్న కోచ్

క్రీడలపై ఆసక్తిని పెంచాలి



నేటి ఆధునిక యుగంలో చిన్నారులు ఎక్కువగా వీడియో గేమ్స్, సెల్‌ఫోన్‌ల వైపు మొగ్గు చూపుతున్నారు. వారికి చిన్ననాటి నుంచి క్రీడలపై ఆసక్తి పెంచితే భవిష్యత్ వారికి నచ్చిన క్రీడల్లో రాణిస్తారు. దీంతో చిన్ననాటి నుంచి రోజుకు రెండు గంటల సమయంలో క్రీడల కోసం కేటాయించడం అలవాటుగా మారుతుంది.

– పీ.నాగరాజు, ఎస్‌9 స్పోర్ట్స్ అకాడమీ, యజమాని తెల్లాపూర్

రెండేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ



మా కుమారుడు యశ్వంత్ శర్మ ఐదవ తరగతి చదువుతున్నాడు. రెండేళ్లుగా క్రికెట్‌లో శిక్షణ ఇప్పిస్తున్నాను. నిత్యం సాయంత్రం రెండు గంటలు క్రికెట్ కోసం సమయాన్ని కేటాయిస్తున్నాడు. దీని వల్ల చిన్నారులు చురుగ్గా, ఆరోగ్యం ఉంటారు.

– చంద్రబాబు శర్మ, భారతీనగర్ డివిజన్

తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి



క్రీడల్లో రాణించే వారికి బంగారు భవిష్యత్ ఉంటుంది. చిన్నారులు విద్యతోపాటు క్రీడల్లో రాణించే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. అథ్లెటిక్స్‌లో జాతీయ, రాష్ట్రస్థాయిలో 30 మెడల్స్ సాధించాను.

– ఏ.శాంతరావు, అథ్లెటిక్స్ క్రీడాకారుడు, డీవీఆర్ స్పోర్ట్స్ క్లబ్ కోచ్

క్లుప్తంగా

యోగా పోటీల్లో విద్యార్థుల సత్తా



పతకాలతో విద్యార్థులు

గజ్వేల్‌రూరల్: సిద్దిపేటలో జరిగిన ఐదవ జిల్లా స్థాయి యోగా పోటీల్లో గజ్వేల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా శనివారం గజ్వేల్‌లో యోగా టీచర్ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగాసన భారత్ సహకారంతో జరిగిన పోటీల్లో బంగారు పతకంతో పాటు కన్సోలేషన్ బహుమతులను అందుకున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో సీనియర్ విభాగంలో యోగా టీచర్ బీ. శ్రీప్రసన్న బంగారు పతకంతోపాటు సాయి జీడీఆర్ పాఠశాలకు చెందిన విద్యార్థి శ్రీకరణ్, ప్రగతి సెంట్రల్ స్కూల్‌కు చెందిన సాదియ బేగం, మంజీరా స్కూల్‌కు చెందిన త్రిపుర, వేద స్కూల్(కుకునూర్‌పల్లి)కి చెందిన ఆనంద్ కన్సోలేషన్ బహుమతులను అందుకున్నారన్నారు. వీరితో పాటు మరో 15మంది ప్రశంసాపత్రాలను పొందినట్లు తెలిపారు.

దుబ్బాక అభివృద్ధికి కృషి

-మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్



పొన్నం ప్రభాకర్‌తో నాయకులు

దుబ్బాక: నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మంత్రిని కలిసి నియోజకవర్గ అభివృద్ధిపై విన్నవించారు. తప్పకుండా నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులతోపాటు కొత్తగా చేపట్టనున్న పనులకు సంబంధించి నిధుల మంజూరికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు.

పోరాటంతో హక్కులను సాధించుకోవాలి

– సాహసం రాష్ట్ర అధ్యక్షుడు ప్రకాశ్



మాట్లాడుతున్న ముప్పారం ప్రకాశ్

గజ్వేల్: పోరాట పటిమతో హక్కులను సాధించుకోవాలని సాహసం(సామాజిక హక్కుల సంఘం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముప్పరం ప్రకాశ్ అన్నారు. శనివారం గజ్వేల్‌లోని టీవైఆర్ లైబ్రరీ హాల్‌లో 'పదేళ్ల తెలంగాణ–ప్రజల స్థితిగతులు' అంశంపై నిర్వహించిన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో ప్రజలకు రాజ్యాంగబద్ధంగా అందాల్సిన హక్కులు అందటం లేదని, పాలకుల నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతుందన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో అన్ని వర్గాల ప్రజల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించారు. ఈ దుస్థితిని మార్చడానికి పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ప్రత్యేకించి సామాజిక హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఆవిర్భవించిన సాహసం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు. హక్కులపై ప్రజా చైతన్యం కోసం నిరంతరం వివిధ కార్యక్రమాలతో ముందుకు సాగుతామన్నారు. టీవైఆర్ ఫౌండేషన్ చైర్మన్ టీ.రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు, యువత చరిత్రను అధ్యయనం చేయాలన్నారు. సదస్సులో టీఎస్‌సీపీఎస్ఈయూ(తెలంగాణ కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్) రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్, సాహసం నాయకులు రమణాకర్, మల్లేశ్ యాదవ్, సోలమన్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్తుండగా..

- కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలు



సంగారెడ్డి: ప్రమాదానికి గురైన కారు

సంగారెడ్డి: ఆర్టీసీ బస్సు కారును ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన హత్నూర మండలం సిరిపురం గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. గుమ్మడిదల మండలం దాచారం గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి అతడి భార్య నర్మద, కూతురు శ్రీనిధి, తల్లి భ్రమరాంబతోపాటు కుమారుడు నర్సాపూర్ నుంచి మెదక్ జిల్లా చిలిప్‌చెడ్ మండలం చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరి దేవి దర్శనానికి కారులో వెళ్తున్నారు. సిరిపుర గ్రామ శివారులోని తెల్లరాళ్ల తండా గేటు సమీపంలోకి రాగానే జోగిపేట నుంచి ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు బోల్తా పడి నుజ్జునుజ్జయింది. ఇందులో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కుమారుడికి ఎలాంటి గాయాలు కాలేదు. క్షతగాత్రులు స్థానికులు ఆస్పత్రికి తరలించారు.. ఈ విషయమై పోలీసులను సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

జహీరాబాద్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి చెందాడు. ఈ ఘటన మండలంలోని గోపన్‌పల్లి క్రాస్‌రోడ్డు వద్ద చోటు చేసుకుంది. చిరాగ్‌పల్లి పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సత్వార్ గ్రామానికి చెందిన పెంటప్ప (65) గ్రామం నుంచి సైకిల్‌పై వెళ్తూ జాతీయ రహదారిని దాటుతున్నాడు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

చికిత్స పొందుతూ ఖైదీ ..

సంగారెడ్డి టౌన్: చికిత్స పొందుతూ ఖైదీ మృతి చెందిన ఘటన సంగారెడ్డిలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై వినయ్ కుమార్ కథనం మేరకు.. జిల్లాలోని రామచంద్రాపురం పీఎస్‌లో కేసు నమోదైన ఘటనలో అదే గ్రామానికి చెందిన మిద్దె మహేశ్(19)కందిలో గల జైలులో అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్నాడు. మహేశ్ కుమార్ అనారోగ్యానికి గురవడంతో 26న రాత్రి సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ 30న అర్ధరాత్రి మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. జైలు సూపరింటెండెంట్ భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బావిలో పడి వృద్ధురాలు

హుస్నాబాద్‌రూరల్: బావిలో పడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన హుస్నాబాద్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేశ్ కథనం మేరకు. పొట్లపల్లి శివారు పల్లె దేవేందర్‌నగర్‌కి చెందిన జొన్నగడ్డల రామవ్వ(70) భర్త అంజయ్య పదేళ్ల కిందటనే మరణించగా కొడుకుల వద్దనే ఉంటుంది. అనారోగ్యంతో బాధపడుతున్న రామవ్వ శుక్రవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి కోసం కొడుకులు ఇద్దరూ చుట్టు పక్కల వెతుకుతుండగా బావిలో కన్పించింది. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు బావి నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి...

మిరుదొడ్డి(దుబ్బాక): ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని అల్మాజీపూర్‌లో చోటు చేసుకుంది. శనివారం భూంపల్లి ఎస్ఐ హరీశ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన గుర్మిళ్ళ చంద్రయ్య (36) వ్యవసాయం చేసుకుంటూ మతిస్థిమితం లేని భార్య లక్ష్మి, కుమారుడు రమేశ్‌ను పోషించుకుంటున్నాడు. రెండు నెలల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రయ్య కాళ్లకు, చేతులకు తీవ్ర గాయాలై ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబ పోషణ భారం కావడంతో జీవితంపై విరక్తి చెంది 27న గుర్తు తెలియని గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

నంది అవార్డుకు ఉపాధ్యాయుడు ఎంపిక



మల్లికార్జునగౌడ్

టేక్మాల్(మెదక్): విద్యా రంగంలో, నిరుపేద విద్యార్థులకు పలు రకాల సేవలు చేసినందుకు వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురు బ్రహ్మ బంగారు నంది అవార్డుకు టేక్మాల్ మండల కుసంగి గ్రామానికి చెందిన పత్తిగారి మల్లికార్జున గౌడ్ ఎంపికైనట్లు శనివారం తెలిపారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండల వెల్టూర్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న మల్లికార్జునగౌడ్‌కుఫౌండేషన్ ఆధ్వర్యంలో 8న రవీంద్రభారతీలో టీచర్స్ డే ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా అవార్డు అందించనున్నట్లు పేర్కొన్నారు. 20 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో చేసిన సేవలకు పలుమార్లు మండల, జిల్లా స్థాయి అవార్డులతోపాటు, లైయన్స్ క్లబ్, పలు ఫౌండేషన్‌ల అవార్డులు పొందినట్లు తెలిపారు. మల్లికార్జున్‌గౌడ్‌ను కుసంగి గ్రామస్తులపాటు తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

తనిఖీలకు వస్తున్నారని ముందే మూసేశారు

పాపన్నపేటలో ప్రథమ చికిత్స కేంద్రాల తీరు



నార్సింగిలో మూసివేసిన ప్రథమ చికిత్స కేంద్రం వద్ద వైద్యాధికారులు

పాపన్నపేట(మెదక్): డెంగీ కేసులు పెరుగుతున్న వేళ వైద్య బృందాలు శనివారం తనిఖీలకు రావడంతో ముందస్తు సమాచారం అందుకున్న ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స కేంద్రాలను మూసివేశారు. వివరాల్లోకి వెళ్తే.. పాపన్నపేట మండలంలో ఇటీవల డెంగీ కేసులు పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రథమ చికిత్స కేంద్రాల్లో జరుగుతున్న చికిత్సపై ఆరా తీసేందుకు జిల్లా హెల్త్ ఎడ్యుకేటర్ రమా ఆధ్వర్యంలో వైద్యాధికారులు తనిఖీలకి వచ్చారు. ఈ సమాచారాన్ని ముందస్తుగానే తెలుసుకున్న ఆర్ఎంపీలు, పీఎంపీలు తమ కేంద్రాలను మూసివేసి వెళ్లిపోయారు. ఆ కేంద్రాల్లో అనారోగ్యానికి గురైన వారికి కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాల్సి ఉంటుందని, సెలైన్లు, స్టెరాయిడ్లు, యాంటీబయాటిక్ చికిత్స అందియొద్దని, ఇన్‌పేషెంట్ సేవలు చేసే అవకాశం లేదని, హెల్త్ ఎడ్యుకేటర్ రమా తెలిపారు. ల్యాబ్‌లను సైతం తనిఖీ చేశారు. ఆమె వెంట డీపీఎంఓ కోట, పీహెచ్‌సీఓ చందర్, సిబ్బంది, రాజశ్రీ, శ్రీకాంత్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

క్రీడా వేదికలను సద్వినియోగం చేసుకోవాలి

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ విశ్వనాథం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత మాట్లాడారు. విద్యార్థుల సమగ్ర వికాసంలో క్రీడల పాత్ర ఎంతగానో ఉంటుందన్నారు. విద్యార్థులు శారీరక, మానసిక వికాసానికి ఇలాంటి క్రీడా వేదికలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. షటిల్ బ్యాడ్మింటన్, క్యారమ్స్, వాలీబాల్, చెస్ తదితర క్రీడల్లో పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రాణాధికారి డాక్టర్ గోపాలసుదర్శనం, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, క్రీడా కమిటీ సభ్యులు కృష్ణయ్య, బాలికిషన్, డా.హరిబాబు, డా.మేరాజ్ ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లోగా పనులు పూర్తి చేయండి

- విద్యుత్‌శాఖలో చేపట్టిన అభివృద్ధిపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలి
- టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ



మాట్లాడుతున్న ముషారఫ్ అలీ ఫరూఖీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్‌శాఖలో చేపట్టిన అన్ని రకాల అభివృద్ధి పనులను డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ అన్నారు. శనివారం జిల్లా విద్యుత్ భవన్‌లో ఎస్ఈ, డీఈ, ఏడీఈ, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు పట్టణంలో వినియోగదారులతో విద్యుత్ సరఫరా, జీరో విద్యుత్ బిల్లు, తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిసరాల్లోని వ్యవసాయదారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా పై ఆరా తీశారు. నిర్మాణంలో ఉన్న సబ్ స్టేషన్‌ను పరిశీలించారు. విద్యుత్ డిమాండ్ సరఫరా, గృహ జ్యోతి పథకం అమలు, సర్కిల్‌లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. అనంతరం ఫరూఖీ మాట్లాడుతూ.. వినియోగదారులతో సంస్థ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదగా మాట్లాడాలన్నారు. రానున్న వేసవి సీజన్‌లో విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగే అవకాశముందన్నారు. ఫీల్డ్ అధికారులు విధిగా ట్రాన్స్ ఫార్మర్‌ల లోడ్‌ను చెక్ చేసి, ఓవర్ లోడైన వాటిని లోడ్ బ్యాలెన్సింగ్‌కు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థ డైరెక్టర్ (ఆపరేషన్) డాక్టర్ నర్సింహులు, రూరల్ జోన్ చీఫ్ ఇంజినీర్ భిక్షపతి, సిద్దిపేట సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రమోహన్, డివిజనల్ ఇంజినీర్లు మహేశ్ కుమార్, లక్ష్మీ నారాయణ, శ్రీనాథ్, భాను ప్రకాశ్, ఏడీఈలు, ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్పత్తిదారుల నుంచి వ్యాపారులుగా..

- రైతులు ఎదగడానికి ఎఫ్‌పీఓలు కృషి చేయాలి
- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి

సిద్దిపేటరూరల్: రైతులు ఉత్పత్తి చేయడంతోపాటు వ్యాపారులుగా మారేలా చేయడమే ఈ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సెంటర్‌ల ముఖ్య ఉద్దేశ్యమని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లాలో గల ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ సీఈవోలు, డైరెక్టర్లతో కలిసి ఎఫ్‌పీఓ సెంటర్‌లపై సమావేశం నిర్వహించారు. మొదటగా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు శాఖలవారీగా సాగుభూమి వివరాలు, పంటల వివరాలు ఉత్పత్తి , ప్రభుత్వ పథకాల గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా క్లుప్తంగా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు ఉత్పత్తిదారుల నుంచి వ్యాపారులుగా మార్చడమే ఎఫ్‌పీఓల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రైతుల్లో చైతన్యం రావడానికి గ్రామాల్లో, మండలాల్లో 2, 4 ఎఫ్‌పీఓ డైరెక్టర్లు, సీఈఓలు కలిసి సమావేశాలు నిర్వహించి వీటి ప్రాముఖ్యతను రైతులకు తెలియజేయాలన్నారు. ప్రతీ సంవత్సరం నిర్వహించే ఎఫ్‌పీఓల జనరల్ బాడీ మీటింగ్‌కు జిల్లా అధికారులను ఆహ్వానించి సమస్యలు తెలిపి వారి సలహాలు, సూచనలు మేరకు ముందుకు సాగాలన్నారు. రైతులను ప్రోత్సహించేందుకు సక్సెస్ ఎఫ్‌పీఓల పనులను క్షేత్ర స్థాయిలో చూపించాలని, ఈఎఫ్‌పీఓలను అభివృద్ధి పథంలో నడపడానికి జిల్లా యంత్రాంగం తరుపున ఎలాంటి సహాయ సహకారాలైనా అందించడానికి కట్టుబడి ఉన్నామన్నారు. అనంతరం ఏపీ మాస్ ప్రతినిధులు మాట్లాడుతూ.. కొత్త సాంకేతిక పద్ధతులను అవలంభించి వ్యాపార దృక్పథంతో ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో ఏపీ మాస్ సీఈఓ టీసీఎస్ రెడ్డి, నాబార్డు డీడీఎం నిఖిల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక, జిల్లా ఉద్యానశాఖ అధికారి సువర్ణ, ఎల్డీఎం హరిబాబు, డీఆర్డీఏ అధికారులు తదితరులు పాల్గొన్నారు.